ఉద్యోగులకు మళ్లీ మొండిచెయ్యేనా?

- ఆర్థికపరమైన డిమాండ్లు అటకెక్కినట్టే!
- ఆర్థికేతర డిమాండ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న త్రిసభ్య కమిటీ
- పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇక అనుమానమే..!
- ఇంకా సర్కారుకు చేరని నివేదిక
- నేటితో ముగియనున్న గడువు
- నేడు ఉద్యోగ జేఏసీ కార్యవర్గం భేటీ

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు, హెల్త్‌కార్డులు, కొత్త పీఆర్సీ వంటి కీలక డిమాండ్లు అటకెక్కినట్టేనా? ఈ సమస్యలు ఇప్పట్లో పరిష్కారమయ్యే అవకాశాలు లేవా? ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మళ్లీ మొండిచెయ్యి తప్పదా? అంటే ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అవును అనే సమాధానమే వస్తున్నది. ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్స్‌లో అత్యంత కీలకమైన ఆర్థికపరమైన అంశాలను సర్కార్ అటకెక్కించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఆర్థికేతర డిమాండ్లపైనే దృష్టిసారించినట్టు వార్తలొస్తున్నాయి. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగ సంఘాల జేఏసీ మొత్తం 57 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. వీటిలో 45 ఆర్థికేతర, స్వల్ప ఆర్థిక భారంపడేవి కాగా, 12 మాత్రమే సర్కార్‌పై పూర్తి ఆర్థికభారం పడేవి ఉన్నాయి. ప్రస్తుతం ఉద్యోగ సంఘాల నేతలు కోరుతున్న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, ఉద్యోగ సంఘాలకు రికగ్నిషన్, హెచ్‌వోడీల నుంచి సచివాలయంలో 12.5% కోటా, ఉద్యోగుల సాధారణ బదిలీలు వంటి అంశాలపై సర్కారు సానుకూలంగా ఉన్నట్టు తెలిసింది. దీంతో ఆర్థికపరమైన డి మాండ్లను పక్కనపెట్టినట్టేనా..? అనే ఆందోళన ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నది. శాఖలవారీగా తీసుకుంటే రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖలకు చెందిన డిమాండ్లే అధికంగా ఉన్నాయి. ఆయా శాఖల ఉద్యోగులు సర్కార్ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

నేటిలోగా నివేదిక అందేనా?

ఉద్యోగ సంఘాల జేఏసీ నుంచి వచ్చిన 57 డిమాండ్ల పరిశీలనకు ఈనెల 6న ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులు లోకేశ్‌కుమార్, కృష్ణభాస్కర్ సభ్యులుగా ఉన్నారు. ఉత్తర్వులు వెలువడిన వారం రోజుల్లో ఈ కమిటీ అన్ని సంఘాలతో చర్చలు జరిపి, సిఫారసుల రూపంలో నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం నిర్దేశించిన ఏడు రోజుల గడువు మంగళవారంతో ముగియనున్నది. సోమవారం వరకు ఈ కమిటీ తమ నివేదికను సర్కార్‌కు అందజేసినట్టు సమాచారం బయటికి రాలేదు. ఇక మిగిలింది మంగళవారమే. అయితే, గడువు ముగిసేలోగా నివేదికను అందజేయడం కష్టంగానే కనిపిస్తున్నది. ఒకవేళ అధికారుల కమిటీ నివేదికను సమర్పించినా, అది మళ్లీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘానికి చేరాలి. ఈ ఉపసంఘం సమావేశమై, నివేదికపై చర్చించాలి. ఆ తర్వా త పూర్తి నివేదికను ముఖ్యమంత్రికి అందజేయాలి. సీఎం ఆయా డిమాండ్లపై సానుకూలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నది.

కార్యాచరణపై తగ్గేదేలే..

జేఏసీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. తమ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం కనిపించకపోవడంతో ఉద్యమ కార్యాచరణపై వెనక్కితగ్గబోమని సంఘాల నేతలు అంటున్నారు. సర్కార్‌పై సమరం కొనసాగిస్తామంటున్నారు. గతంలో తాము ప్రకటించిన కార్యాచరణ కొనసాగుతుందని ఒక నేత తెలిపారు. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆందోళనల షెడ్యూల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్టు మరో నేత పేర్కొన్నారు. గతంలో జేఏసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15న అన్ని జిల్లాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన.. జూన్ 9న హైదరాబాద్‌లో లక్ష మందితో ర్యాలీ, మహాధర్నా నిర్వహించాల్సి ఉన్నది. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్టు ఉద్యోగ సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. అయితే, ఈ ఉద్యమంలో ఎలాంటి మార్పు ఉండదని, ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్లో కొంత మార్పు చేసే అవకాశం ఉన్నదని ఆయా నేతలు తెలిపారు.

నేడు జేఏసీ సమావేశం

తాజా పరిణామాల నేపథ్యంలో ఉద్యోగ సంఘాల జేఏసీ మంగళవారం హైదరాబాద్‌లో సమావేశంకానున్నది. నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో జేఏసీ కార్యవర్గం మధ్యాహ్నం భేటీకానున్నది. ఉద్యోగుల సమస్యలపై సర్కార్ వైఖరితోపాటు ఇప్పటికే ప్రకటించిన జేఏసీ కార్యాచరణపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉన్నది. 'నన్ను కోసుకుతిన్నా రూపాయి లేదు.. ఎవరిపై మీరు సమరం జేస్తరు. ఎవరి మీద యుద్ధం ప్రకటిస్తరు' అన్న సీఎం వ్యాఖ్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్టు తెలిసింది. ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీతో ఒక దఫా చర్చలు జరిపిన నేపథ్యంలో మరికొన్ని సమస్యలను సర్కార్ ముందుంచాలని నేతలు భావిస్తున్నారు. అవసరమైతే, మరోసారి అధికారుల కమిటీతో భేటీకావాలన్న ఆలోచనలో నేతలున్నారు. ఆర్థికేతర డిమాండ్లతోపాటు ఆర్థికపరమైన డిమాండ్లపై కూడా ఒత్తిడి పెంచాలని ఉద్యోగ సంఘాల నేతలు భావిస్తున్నారు. ముఖ్యంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులపై గట్టిగా పట్టుబట్టాలన్న ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించండి

ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్‌తో జేఏసీ నాయకులు సోమవారం భేటీ అయ్యారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించి నివేదికను మిట్టల్‌కు అందజేశారు. ఈనెల 6న తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో చేసిన తీర్మానాలను అత్యవసర, ఆర్థిక, ఆర్థికేతరంగా విభజించి నివేదిక రూపంలో మిట్టల్‌కు అందజేశారు. ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానం(సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్(ఓపీఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ నేతలు కోరారు. పొరుగు సేవల ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 317 జీవో ద్వారా మరికొన్ని రకాల బదిలీలకు అవకాశం కల్పించాలని, ప్రభుత్వ ఖజానాపై తక్షణ భారం పడని 24 అంశాలను తొలుత పరిష్కరించి ఆ తర్వాత మిగిలిన 14పైగా ఆర్థిక భారంతో ముడిపడిన అంశాలను దశల వారీగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తంగా 44 అత్యవసర సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు.

1.75 లక్షల ఎకరాలు
కుదువ పెట్టే కుట్ర

- అందుకే టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్‌గా మార్పు చేసిండ్రు
- వేల కోట్ల రుణాల కోసం కాంగ్రెస్ సర్కారు భారీ స్కెచ్
- ఏప్రిల్ 15నే రహస్యంగా జీవో జారీ చేసిన ప్రభుత్వం
- 1.80 లక్షల కోట్ల అప్పు తెచ్చి రాష్ట్రానికి ఏం చేసిండ్రు?
- లక్ష కోట్లతో బడా కాంట్రాక్టర్ల జేబులు నింపుడే సీఎం పని
- సీఎందే 20శాతం కమీషన్
- ఇందుకు నిర్దిష్టమైన ఆధారాలున్నాయి : కవిత

నాంచారమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ / ములుగు, మే12 (నమస్తేతెలంగాణ) : కేసీఆర్ హయాంలో పరిశ్రమల ఏర్పాటు కోసం సిద్ధం చేసిన 1.75 లక్షల ఎకరాల భూములను కాంగ్రెస్ సర్కారు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువ పెట్టేందుకు కుట్రలు చేస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ప్రైవేట్ కంపెనీ అయిన టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ గత ఏప్రిల్ 15న జీవో నంబర్ 24ను దొడ్డిదారిన జారీ చేసి రుణం తెచ్చేందుకు స్కెచ్ వేసిందని నిప్పులు చెరిగారు. 'నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పబ్లిక్ డొమైన్‌లో ఉంచాల్సిన ఉత్తర్వులను దాచిపెట్టడం ఎందుకు? విలువైన భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? ఏదైనా పరిస్థితుల్లో నష్టం వస్తే భూముల పరిస్థితి ఏమిటి? మన పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టడం ఎందుకు?.. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలను కుదవబెట్టి తీసుకొచ్చిన రూ. 10 వేల కోట్లను ఏ ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారు? ఏపథకం అమలుకు వెచ్చించారు? ' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. నిర్దిష్టమైన ఆధారాలతో తాను చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఒకవేళ తన ఆరోపణలు తప్పని భావిస్తే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

■ రేవంత్ కమీషన్ 20 శాతం

బీఆర్‌ఎస్ పాలనలో రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారని దివాలాకోరు మాటలు మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, 17 నెలల్లో రూ.1.80 లక్షల కోట్ల అప్పు ఎందుకు తెచ్చారని కవిత ప్రశ్నించారు. తెచ్చిన రుణాల్లో కేవలం రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు చెల్లించారని, మిగిలిన లక్ష కోట్లతో బడా కాంట్రాక్టర్ల జేబులు నింపారని ఆరోపించారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి 20శాతం కమీషన్ కింద అంటే రూ. 20 వేల కోట్లను దిగమింగారని ధ్వజమెత్తారు. ఇందుకు సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయని స్పష్టం చేశారు.

■ కేసీఆర్ లక్షల కోట్ల ఆస్తులు సృష్టించిండ్రు

కేసీఆర్ పదేండ్లల్లో రూ. 4.17 లక్షల కోట్లు తెచ్చి లక్షలాది కోట్ల ఆస్తులు సృష్టించారని కవిత చెప్పారు. ఎన్నో నీటి పారుదల ప్రాజెక్టులు కట్టారని, విద్యుత్తు కేంద్రాలు నిర్మించారని, రోడ్లు వేశారని, పల్లెప్రగతికి బాటలు వేశారని పేర్కొన్నారు. కానీ, రేవంత్ ప్రభుత్వం రూ. 1.80 లక్షల కోట్ల అప్పు తెచ్చి ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కనీసం చెరువుల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించలేదని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇవ్వలేదని మండిపడ్డారు. తన మంత్రివర్గంలోని పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు చెల్లించారని ఆరోపించారు.

■ రేవంత్ పాలనలో అవమానాలు..

రేవంత్ పాలనలో తెలంగాణ ప్రజలను అడుగడుగునా అవమానిస్తున్నారని కవిత మండిపడ్డారు. హెచ్‌సీయూలోని 400 ఎకరాలను అమ్మవద్దని అడ్డుకున్న విద్యార్థులను కొట్టారని, వద్దన్న పర్యావరణ ప్రేమికులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని తూర్పారబట్టారు. సీఎం రేవంత్ పాలనను గాలికొదిలి తెలంగాణను సాధించి తెచ్చిన కేసీఆర్‌ను బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ అనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి రుజువు చేశారని దెప్పిపొడిచారు.

రామప్ప వద్ద ఓపెన్ కాస్టులు వద్దు

యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయం సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో ఓపెన్ కాస్టు గనులను ఏర్పాటు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకొనేది లేదని ఎమ్మెల్సీ కవిత తేల్చి చెప్పారు. సోమవారం ఆమె ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని సందర్శించి రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2012లోనే రామప్ప ఆలయానికి 5 కిలోమీటర్ల దూరంలో ఓపెన్ కాస్టు మైన్ ఏర్పాటుకు ప్రయత్నిస్తే నాడు ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఓపెన్ కాస్టు మైన్‌ల ఏర్పాటు ప్రయత్నాలను ముందుకు సాగనివ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రాగానే మళ్లీ ఓపెన్ కాస్టు మైన్ల పేరుతో బొగ్గు తవ్వకాలకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఆలయానికి 5 కిలోమీటర్ల దూరంలో బ్లాస్టింగ్‌లు జరిపితే ఆలయం దెబ్బతినే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోనే రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. ఏడాదిన్నరగా పట్టించుకోని మంత్రి సీతక్క ఇప్పుడు అందాల పోటీ కోసం రామప్ప వద్ద పైపై మెరుగులు దిద్దుతున్నారని దుయ్యబట్టారు. ఓ వైపు యుద్ధ వాతావరణం నెలకొంటే.. సీఎం మాత్రం అందాల పోటీల ప్రారంభోత్సవానికి హాజరయ్యారని అన్నారు. అనంతరం రా మాంజాపూర్‌లో నాంచారమ్మ జాతరకు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఎరుకల కులస్తులతో సహపంక్తి భో జనం చేశారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో కవిత వెంట బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, తెలంగాణ ఎరుకల అధ్యక్షుడు లోకిని రాజు, నాయకులు కేతిరి భిక్షపతి, రాజశేఖర్, లోకిని సమ్మయ్య, ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం నయా ప్లాన్!

- టీజీఐఐసీని గుట్టుగా పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్పు
- గత నెల 15నే ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- టీఎస్ఐఐసీ ఆధీనంలో 1.20 లక్షల ఎకరాల భూములు
- కార్పొరేషన్ ఆస్తుల ఆధారంగా స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా బాండ్లు జారీచేసి నిధులు సమీకరించేలా సన్నాహాలు
- కొత్త పరిశ్రమలకు భూ కేటాయింపులు ఇక అసాధ్యం

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూములను విక్రయించేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టడంతో నిధుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మరో కొత్త మార్గాన్ని ఎంచుకున్నది. టీజీఐఐసీ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్)ను గుట్టుచప్పుడు కాకుండా పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ గత నెల 15నే ఉత్తర్వులు జారీచేసింది. టీజీఐఐసీకి ఉన్న ల్యాండ్ బ్యాంక్ ఆధారంగా స్టాక్ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు, ఇందులో భాగంగానే కార్పొరేషన్‌ను పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్పు చేసినట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి.

■ షేర్ హోల్డర్ల సంఖ్య పెంపు

టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చడంతోపాటు షేర్ హోల్డర్ల సంఖ్యను ప్రస్తుతం ఉన్న నాలుగు నుంచి ఏడుకు పెంచారు. ప్రస్తుతం కంపెనీకి ఉన్న 100 షేర్లను ఏడుగురికి పంచుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గవర్నర్ తరఫున గవర్నర్ సంయుక్త కార్యదర్శి జే భవానీ శంకర్‌కు 94 షేర్లు కేటాయించగా, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ ఈ విష్ణువర్ధన్ రెడ్డి, పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి కేఎస్ ప్రసాద్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, పరిశ్రమల శాఖ కమిషనర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి తదితర ఆరుగురికి ఒక్కోటి చొప్పున షేర్లను కేటాయించారు. గత నెల 15న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినా ఇన్నిరోజులూ గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అప్పుల కోసం చేయని ప్రయత్నం లేదు. తమను ఎవరూ నమ్మడం లేదని, ఎక్కడా అప్పు పుట్టడం లేదని స్వయంగా ముఖ్యమంత్రే పలు సందర్భాల్లో బహిరంగంగా చెప్పారు. భూములు అమ్మి నిధులు సమకూర్చుకుందామంటే కంచ గచ్చిబౌలి వ్యవహారం తీవ్ర వివాదాస్పదమై దేశవ్యాప్తంగా విమర్శలకు దారి తీసింది. దీంతో ప్రభుత్వం టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చి బాండ్లను జారీ చేయడం ద్వారా ప్రజలనుంచి నిధులు రాబట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

■ 1.50 లక్షల ల్యాండ్ బ్యాంక్

రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం టీజీఐఐసీకి దాదాపు 1.50 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో అత్యంత విలువైన భూములు ఉండడం గమనార్హం. కాగా వీటిలో దాదాపు 30వేల ఎకరాలను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించగా, ఇంకా సుమారు 1.20 లక్షల ఎకరాల భూములు టీజీఐఐసీ ఆధీనంలో ఉన్నట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి. ఈ భూముల విలువను అంచనా వేయడం కష్టమని పేర్కొంటున్నాయి.

ఈ భూములను లేఔట్లుగా అభివృద్ధి చేసి పరిశ్రమలకు విక్రయించాల్సి ఉండగా, ప్రభుత్వం ఈ ఆస్తులను ఆధారం చేసుకొని స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా బాండ్లు జారీచేసి నిధులు సమీకరించాలని భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇదివరకే టీజీఐఐసీ నగర శివార్లలో పెద్ద ఎత్తున భూములను విక్రయించగా, ఇటీవల కంచ గచ్చిబౌలి భూములపై దాదాపు రూ.10వేల కోట్లను బ్యాంకు ద్వారా రుణంగా తీసుకున్నది. ప్రస్తుతం ఉన్న భూములపై ఏమేరకు నిధులు సమీకరించనున్నారో ఇప్పుడే చెప్పలేమని అధికారులు చెప్తున్నారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చడంతో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమించాల్సి ఉంటుందని, ప్రస్తుత వాటాదారులు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారని పేర్కొంటున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా ఏమేరకు నిధులు సమీకరించాలనేది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లే నిర్ణయిస్తారు.

■ పరిశ్రమలకు ఇక ఇబ్బందులే

ఇకమీదట కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునేవారికి భూముల కేటాయింపు అంత సులభం కాదని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇంతకాలం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా టీజీఐఐసీ ఆధ్వర్యంలోనే భూముల కేటాయింపు జరుగగా, పబ్లిక్ లిమిటెడ్ అయ్యాక ఏ నిర్ణయం తీసుకున్నా వాటాదారులకు సమాచారం అందించి వారి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. మెజార్టీ షేర్లు ప్రభుత్వం వద్ద ఉన్నంతకాలం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ప్రభుత్వం పరిశ్రమలకు భూములను విక్రయించవచ్చని, ఒకవేళ వాటాదారులు ఎక్కువైతే భూముల విక్రయం అంత సులభం కాదని చెప్తున్నారు. నిబంధనలకు లోబడి ఆస్తుల విలువ ఆధారంగా మాత్రమే బాండ్లు జారీచేసి నిధులు సేకరించే వీలు కలుగుతుందని, ఒకవేళ కంపెనీ దివాలా తీస్తే ఆస్తులు విక్రయించి వాటాదారులకు పంచాల్సి ఉంటుందని పరిశ్రమల వర్గాలు తెలిపాయి. మొత్తమ్మీద నిధుల సమీకరణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ సరికొత్త ఎత్తుగడ పారిశ్రామికరంగం పాలిట శాపంగా మారనున్నదనే ఆందోళనలు పరిశ్రమ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్ లిమిటెడ్, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలకు ప్రధాన తేడా ఇదే.

- ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ షేర్ల బదిలీ పరిమితంగా ఉంటుంది. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా పబ్లిక్‌కు బదిలీ చేయవచ్చు. ప్రైవేట్ కంపెనీకి కనీస సభ్యుల సంఖ్య ఇద్దరు కాగా, పబ్లిక్ కంపెనీకి కనీసం ఏడుగురు సభ్యుల అవసరం ఉంటుంది.
- ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో యాజమాన్యం, కుటుంబ సభ్యులు లేక పెట్టుబడిదారులు పరిమిత సంఖ్యలో ఉంటారు. షేర్ల బదిలీ కూడా పరిమితంగా ఉంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేయరు. పబ్లిక్ నుంచి నిధుల సమీకరణకు అవకాశం లేదు.
- పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం విషయానికొస్తే, ఇందులో అపరిమితంగా వాటాదారులను కలిగి ఉండవచ్చు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేయవచ్చు. షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా పబ్లిక్‌కు బదిలీ చేయవచ్చు. తద్వారా నిధులు సమీకరించుకోవచ్చు.

దోపిడీ, పీడనపై పోరాడిన 'అరుణోదయ'

- వందేండ్ల కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర
- అరుణోదయ సమాఖ్య 50 ఏండ్ల స్ఫూర్తి సభలో వక్తలు

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): సమాజంలోని దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) పని చేస్తున్నదని పలువురు ప్రజా, సాంస్కృతిక, హక్కుల సంఘాల నేతలు కొనియాడారు. ఏసీఎఫ్ 50 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్ఫూర్తి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య పార్క్ నుంచి వీఎస్‌టీ హాల్ వరకు



కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అరుణోదయ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు జెండాను ఆవిష్కరించారు. సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క అధ్యక్షతన జరిగిన స్ఫూర్తి సభలో ఆడియో, వీడియో పాటను ఆవిష్కరించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ముద్రించిన 50 ఏండ్ల అరుణోదయ సావనీర్‌ను ఎనిశెట్టి శంకర్ ఆవిష్కరించారు. సమావేశంలో సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 50 ఏండ్లు పూర్తి చేసుకున్న అరుణోదయ తన ఆశయసాధనలో మరింత శక్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక రంగంలో అరుణోదయ కళాకారులు విశేష కృషి చేశారని జన సాహితీ అధ్యక్షుడు దివికుమార్ అభినందించారు. పాట ప్రజలు, కష్టజీవులదని మానవ హక్కుల వేదిక ప్రతినిధి జీవన్‌కుమార్ తెలిపారు. 50 ఏండ్లుగా ప్రజల పక్షాన అరుణోదయ పోరాటం చేసిందని ప్రొఫెసర్ కొండా నాగేశ్వరావు కొనియాడారు. సమావేశంలో ప్రొఫెసర్ కాశీం, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూర్యం తదితరులున్నారు.

షరతుల్లేని గిఫ్ట్ డీడ్ రద్దు చెల్లదు
హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): ప్రేమ, వాత్సల్యంతో మనుమళ్లకు ఎలాంటి షరతులు విధించకుండా ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను సీనియర్ సిటిజన్స్ చట్టం కింద రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఒప్పందంలోని షరతులను ఉల్లంఘించినప్పుడే సీనియర్ సిటిజన్స్ చట్టంలోని సెక్షన్ 23(1) కింద గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసుకునేందుకు వీలుంటుందని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని ఓ భవనంలో తనకు బహూకరిస్తూ ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను తన తాత (తల్లి నాన్న) ఫిర్యాదు మేరకు ఆర్డీవో రద్దు చేయడంపై అమెరికాలోని రోహిత్ శౌర్య పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు ఈ తీర్పు ఇచ్చింది.

కమిటీ అనుమతితోనే నిర్ణయాలు
మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి వివరణ

హైదరాబాద్, మే 12(నమస్తే తెలంగాణ): ఎరువుల రవాణా, స్టోరేజీ, హ్యాండ్లింగ్‌కు సంబంధించి నిబంధనల ప్రకారమే టెండర్లు నిర్వహిస్తున్నట్టు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ఎరువుల గుట్టు ఎవరికెరుక..? శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. కమిటీ నిర్ణయం ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. టెండర్‌ను రెండేండ్లకు నిర్వహించాలని ముందుగానే నిర్ణయం తీసుకున్నామని, అయితే పేపర్ నోటిఫికేషన్‌లో తప్పులు దొర్లగా, వెంటనే వాటిని సవరించి మరో నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఆయన వివరించారు. నిరుడు ప్రభుత్వ అనుమతితో కొటాక్ మహేంద్రతో ఎంప్యానల్ అయినట్టు పేర్కొన్నారు.

'అందగత్తెలకు నీరా' హర్షణీయం

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన అందగత్తెలకు నీరా సేవించే అవకాశం కల్పించడంపై గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి నుంచి స్వీకరించే నీరా, కల్లు, ముంజల ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈఆర్సీ సభ్యుల ప్రమాణస్వీకారం
శుభాకాంక్షలు తెలిపిన వీఏవోఏటీ

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ) సభ్యులుగా నియమితులైన కే రఘు, సీ శ్రీనివాసరావు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కొత్త సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఎర్రగడ్డలోని విద్యుత్తు నియంత్రణ్ భవన్‌లో ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున కొత్త సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈఆర్సీ టెక్నికల్ సభ్యుడిగా కే రఘు, ఫైనాన్స్ సభ్యుడిగా సీ శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసింది. కే రఘు, సీ శ్రీనివాసరావుకు విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) శుభాకాంక్షలు తెలిపింది. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపకంటి అంజయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం కొత్త సభ్యులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపింది.

గొంతులో మటన్ ముక్క ఇరుక్కొని ఒకరి మృతి

కోటగిరి, మే 12: మటన్ ముక్క గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరాడక ఒకరు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సుద్దులతండాలో ఆదివారం చోటుచేసుకున్నది. కోటగిరి ఎస్సై సునీల్ వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లికి చెందిన రుత్వన్ తారా సింగ్(48) భార్యతో కలిసి నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సుద్దులంతండాలోని బంధువుల ఫంక్షన్‌లో భోజనం చేస్తుండగా, మటన్‌ముక్క గొంతులో ఇరుక్కుని మృతిచెందాడు. మృతుడి భార్య రుత్వన్ యమునాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

రేవంత్ శాడిస్టు.. ఓ సైకో

- నా మాటలకు కట్టుబడి ఉన్నా
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్, మే 12: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ సైకో, శాడిస్టు అంటూ తాను చేసిన వ్యాఖ్యలకు కట్టబడి ఉన్నానని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. సోమవారం ఆయన మేడ్చల్‌లోని తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన తుగ్లక్ పాలనలా ఉన్నదని విమర్శించారు. రెక్కలు ముక్కలు చేసుకొని నిర్మించుకున్న ఇండ్లను కూల్చొద్దని కోరితే, ఎవరి మాటా వినను, అనుకున్నదే చేస్తాననేవారిని సైకో కాక పోతే ఏమని అనాలని ప్రశ్నించారు. కూకట్‌పల్లిలో నల్లచెరువు వద్ద నిర్మించుకున్న ఇండ్లను కూల్చుతారన్న భయంతో బుచ్చమ్మ అనే వృద్ధురాలు చనిపోయిందని, ఇంతటి దారుణాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. మంత్రులు, అధికారుల మధ్య సమ



న్వయం లేదని, పరిపాలన మీద రేవంత్‌రెడ్డి పూర్తిగా పట్టు కోల్పోయారని విమర్శించారు. విదేశీ పర్యటనల్లో ఉన్న సీఎం అబద్ధాలు చెప్తే ప్రజలు నమ్ముతారని వ్యాఖ్యానించారని, ఆ వీడియోను బయటపెడుతామని పేర్కొన్నారు.

ఈటల ఇంటి ముట్టడికి కాంగ్రెస్ యత్నం

సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనా తీరును విమర్శిస్తూ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ సోమవారం ఈటల ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు పరిధిలో ఉన్న ఈటల రాజేందర్ నివాసం వద్ద సోమవారం ఉదయం నుంచే పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

గవర్నర్ జిష్ణుదేవ్‌తో సీఎం రేవంత్ భేటీ
మిస్ వరల్డ్ ముగింపు వేడుకలకు ఆహ్వానం!

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లారు. మిస్ వరల్డ్ ముగింపు వేడుకలకు రావాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించినట్టు సమాచారం. అలాగే ఆర్టీఐ ఫైళ్ల క్లియరెన్స్‌పై చర్చించినట్టు తెలిసింది.

నలుగురు ఆర్టీఐ కమిషనర్ల నియామకం

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గ్రీన్‌సిగ్నల్
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- సీఎంపీఆర్వో ఎంపికపై దుమారం

హైదరాబాద్ మే 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్లుగా నలుగురు నియమితులయ్యారు. పీవీ శ్రీనివాస్‌రావు, పర్విన్ మోహిసిన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులను జారీచేసింది. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని నియమించగా, ఇప్పటికే ఆయన బాధ్యతలను స్వీకరించారు. ప్రభుత్వం గత ఏప్రిల్‌లో చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌కు ఒకరు, కమిషనర్ పదవులకు ఏడుగురి పేర్లతో జాబితాను గవర్నర్‌కు సిఫారసు చేసింది. ఇందులో నలుగురు కమిషనర్ల నియామకానికి గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కప్పర హరిప్రసాద్, వైష్ణవి, రాములు ఎంపికపై సందిగ్ధం నెలకొన్నది. ఇదిలా ఉండగా, సీఎం కార్యాలయంలో సీపీఆర్వోగా పనిచేస్తున్న బోరెడ్డి అయోధ్యరెడ్డి ఎంపికపై దుమారం రేగుతున్నది. ఆయన కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పూర్తిస్థాయిలో రాజకీయ నేపథ్యం ఉన్నది. పక్కా రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తిని సమాచార కమిషనర్‌గా ఎలా నియమిస్తారని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. అర్హులను పక్కనబెట్టి అర్హతలేని వారిని అందలమెక్కించడంలోని మతలబు ఏమిటని ప్రశ్నిస్తున్నారు.